సాక్షి
కాకినాడ

శుక్రవారం । 10 । నవంబర్ । 2023



జెఎన్‌టీయూకే..

జేఎన్‌టీయూకే విద్యార్థులు బహుళజాతి సంస్థల్లో కొలువులు దక్కించుకున్నారు. కళాశాల 75 ఏళ్ల చరిత్రలో అత్యధిక వేతనం పొందిన విద్యార్థులుగా వారు నిలిచారు. - 2లో▸



క్రీడలతో ఉల్లాసం

క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ఆంధ్రప్రదేశ్ టూరిజం, కల్చర్ అండ్ యూత్ అడ్వాన్స్‌మెంట్ అండ్ స్పోర్ట్స్ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. - 2లో▸

డెల్టాలకు 5 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు గురువారం 5 వేల క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు, మధ్య డెల్టాలకు చెరో వెయ్యి, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కుల చొప్పన వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

నిజరూపంలో సత్యదేవుని దర్శనం

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరులు గురువారం నిజరూపంతో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు గత నెల నుంచి ప్రతి గురువారం సత్యదేవుని నిజరూప దర్శనం కల్పిస్తున్న విషయం విదితమే. ఆశ్వయుజ బహుళ ఏకాదశి సందర్భంగా సత్యదేవుడు, అమ్మవారికి ఉదయం 7 గంటలకు 108 స్వర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకూ తులసి దళార్చన నిర్వహించారు. సత్యదేవుని సుమారు 25 వేల మంది దర్శించి, పూజలు చేశారు. వ్రతాలు 1,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. వారం రోజుల విరామం అనంతరం రత్నగిరిపై తెల్లవారుజామున సుమారు 40 వివాహాలు జరిగాయి.

తార్కిక ఆలోచనలు ప్రోత్సహించాలి



సైన్స్ కాంగ్రెస్ పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ నాగమణి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యార్థుల్లో తార్కిక ఆలోచనలను ప్రోత్సహించి, శాస్త్ర సాంకేతిక విజ్ఞానం పెంపొందించాలని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ జి.నాగమణి అన్నారు. మల్లాడి సత్యలింగ నాయకర్ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సైన్స్ ప్రదర్శనలపై రెండు నెలలుగా అవగాహన కల్పించడం వల్ల ఎక్కువ ప్రాజెక్టులు ప్రదర్శనకు వచ్చాయన్నారు. ఎంఎస్ఎన్ చారిటీస్ చైర్మన్ మల్లాడి కార్తీక్ నాయకర్, కాకినాడ సీపోర్ట్ అధికారి మురళీధర్ కూడా ప్రసంగించారు. కార్యక్రమంలో ఐఐఎఫ్‌టీ సభ్యులు కృష్ణప్రియ, రోటరీ క్లబ్ కాకినాడ అధ్యక్షుడు గోపి కాశీ విశ్వనాథ్, జాతీయ బాలల సైన్స్ కో ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మళ్లీ జగనే రావాలి

- మరోసారి ఆయన సీఎం అయితేనే ఏపీకి ఉజ్వల భవిత
- ప్రారంభమైన 'వై ఏపీ నీడ్స్ జగన్'
- పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు

కాకినాడ: 'ఔను.. జగన్ మళ్లీ రావాలి. మా **భవిష్యత్‌కు** భరోసా కావాలి. ఇప్పుడు అమలవుతున్న **సంక్షేమం** కొనసాగాలి. ఇవన్నీ జరగాలంటే ఏపీకి **జగన్ మరో**సారి ముఖ్యమంత్రి కావాలి' అంటూ **అన్ని వర్గాల** ప్రజలూ నినదించారు. 'వై ఏపీ నీడ్స్ **జగన్**' (**ఆం**ధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి) కార్యక్రమాన్ని గురువారం జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ పండగ వాతావరణంలో ప్రారంభించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వానికి సంపూర్ణ మద్దతు తెలిపారు. మంత్రి దాడిశెట్టి రాజాతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని తెలుగుదేశం పార్టీ పాలనలో ప్రజలను దగా చేసిన వైనాన్ని వివరించారు. ఇచ్చిన మాటకు కట్టుబడిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో అమలు చేసిన పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జిల్లాలో తొలి రోజు 27 సచివాలయాల్లో లబ్ధిదారులకు అందించిన సంక్షేమం వివరాలతో కూడిన ప్రచార బోర్డులను ఆవిష్కరించారు. ప్రస్తుత, గత ప్రభుత్వాల పాలనా వ్యత్యాసాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. భవిష్యత్ తరాల మేలుకు జగన్ మళ్లీ రావాల్సిన ఆవశ్యకతను తెలియజెప్పారు.

- కాకినాడ 18వ డివిజన్ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు. టీడీపీ - వైఎస్సార్ సీపీ ప్రభుత్వాల మధ్య వ్యత్యాసాలను, సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను, చంద్రబాబు పాలనలో చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న తదితరులు పాల్గొన్నారు.
- పిఠాపురం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. గత టీడీపీ వైస్సార్ సీపీ పాలనలో వ్యత్యాసాన్ని ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆధ్వర్యంలో ప్రజలకు వివరించారు. కొత్తపల్లి మండలం పాత ఇసుకపల్లి, పిఠాపురం మండలం మాధవాపురం గ్రామాల్లో జరిగిన సభల్లో సంక్షేమ పథకాల ప్రచార బోర్డులను ఆవిష్కరించి, ప్రజలకు చేకూర్చిన లబ్ధిని వివరించారు.
- **ప్రత్తిపాడు మండలం చినశంకర్లపూడిలో ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ ఆధ్వర్యాన 'ఏపీకి** జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం జరిగింది. అక్కడి సచివాలయంలో మండల అధికారుల పర్యవేక్షణలో లబ్ధిదారులతో సమావేశం జరిగింది. నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో వివిధ పథకాల ద్వారా అందించిన లబ్ధిని వివరిస్తూ ఏర్పాటు చేసిన ప్రచార బోర్డును ఎమ్మెల్యే పర్వత ఆవిష్కరించారు. ప్రజలనుద్దేశించి మాట్లాడారు.
- జగ్గంపేట నియోజకవర్గం మల్లిసాల, ఉప్పలపాడు, జగపతినగరం, గోకవరం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పాల్గొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 33 సంక్షేమ పథకాల ద్వారా ఎంత మందికి ఏ మేరకు లబ్ధి చేకూర్చారో ఆయా సభల్లో వివరించారు. ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.
- పెద్దాపురం మండలం దివిలిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పాల్గొన్నారు. జగన్‌ను మళ్లీ సీఎంగా గెలిపించుకుంటేనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగి, పేదల జీవన స్థితిగతులు మెరుగుపడతాయని అన్నారు.
- కాకినాడ రూరల్ ఇంద్రపాలెం సచివాలయం-2 పరిధిలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ ఆధ్వర్యాన సచివాలయం వద్ద సంక్షేమ పథకాల ప్రచార బోర్డును ఆవిష్కరించారు. సీఎం జగన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పర్యవేక్షణలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు.

నాలుగున్నరేళ్లలో చేసిన మేలు చెప్పండి

మంత్రి దాడిశెట్టి రాజా



గృహ సారథులకు, సచివాలయ కన్వీనర్లకు పార్టీ కిట్లు అందజేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో చేసిన మేలును ప్రజలకు అర్థమయ్యే రీతిలో చెప్పాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని మండలం దొండవాకలో జేసీఎస్ కన్వీనర్ సకురు నాగేంద్ర నెహ్రూ ఆధ్వర్యాన గురువారం ఏర్పాటు చేసిన 'వై ఏపీ నీడ్స్ జగన్' (ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు జగన్ కావాలి) కార్యక్రమాన్ని మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. పార్టీ జెండా ఎగురవేసి, గృహ సారథులకు, సచివాలయ కన్వీనర్లకు పార్టీ సమకూర్చిన కిట్లు అందజేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలకు చేకూరిన లబ్ధి బోర్డును సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడుతూ, వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా దొండవాక గ్రామానికి రూ.23.09 కోట్ల మేర ప్రయోజనం చేకూరిందన్నారు. ఏ కుటుంబానికి ప్రభుత్వం ఎంత మేర లబ్ధి చేకూర్చిందో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు ఇంటింటా వివరించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. 2019కి ముందు పరిస్థితిని, ఆ తర్వాత జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావలసిన ఆవశ్యతను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలదేనని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయన్నారు. అభివృద్ధి పథంలో ఏపీ మరింతగా దూసుకుపోవాలంటే జగన్ మళ్లీ సీఎంగా రావాలన్నారు. సీఎం జగన్ ఆశయాలు, లక్ష్యాలను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని మంత్రి రాజా సూచించారు. కార్యక్రమంలో ఏపీ పెరిక డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పురుషోత్తం గంగాభవాని, మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, సర్పంచ్ లంక లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు లంక పార్వతి, డీసీసీబీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు, ఎంపీడీఓ పి.రవికుమార్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ముగిసిన ఈవీఎంల ప్రాథమిక తనిఖీ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో గత నెల 16 నుంచి నిర్వహిస్తున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) ప్రాథమిక స్థాయి తనిఖీ (ఫస్ట్ లెవెల్ చెక్) గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఈ తనిఖీలో పాల్గొన్న బెంగళూరులోని బెల్ సంస్థ ఇంజినీర్లు కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాద పూర్వకంగా కలిశారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రతి రోజూ ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకూ ఈవీఎంల తనిఖీ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించామని కలెక్టర్ అన్నారు. బెల్ నుంచి వచ్చిన 12 మంది ఇంజినీర్లు ఈవీఎంలోని కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లను తనిఖీ చేశారన్నారు. జిల్లాకు వచ్చిన 5,227 బ్యాలెట్ యూనిట్లు, 4,147 కంట్రోల్ యూనిట్లు, 5,066 వీవీ ప్యాట్‌లకు సంబంధించి ఫస్ట్ లెవల్ చెక్ పూర్తయ్యిందని వివరించారు. రాజకీయ పార్టీల నాయకులు తమ దృష్టికి తీసుకువచ్చిన అన్ని అంశాలనూ పూర్తి స్థాయిలో పరిశీలించామని చెప్పారు.

రీ సర్వే పనులపై దృష్టి సారించాలి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఎస్.ఇలక్కియ తదితరులు పాల్గొన్నారు. రీ సర్వే, జాతీయ రహదారులు, గోదాములకు అవసరమైన భూ సేకరణ, కౌలు రైతులకు రుణాలు, ఎరువుల సరఫరా, రబీ సీజన్ సన్నద్ధత, జగనన్న పాలవెల్లువ కార్యక్రమం కింద మహిళా పాడి రైతులకు రుణాల మంజూరు, జగనన్న కాలనీల లే అవుట్ పనులు, గృహ నిర్మాణాల వంటి అంశాలపై జవహర్‌రెడ్డి సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న భూ హక్కు - భూ రక్ష పథకానికి సంబంధించిన రీ సర్వే పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఖరీఫ్ వరి సాగు చివరి దశలో ఉందని, కొన్ని ప్రాంతాల్లో పంట కొనుగోలు ప్రారంభమైందని చెప్పారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.

క్లుప్తంగా

కల్ప, అశ్వవాహనంపై కలియుగ దైవం



కల్పవక్షం వాహనంపై స్వామివారు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో గురువారం స్వామి కల్పవృక్ష వాహనం, కల్కి అలంకరణతో అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని అంగరంగ వైభవంగా మేళతాళాలతో గ్రామంలో ఊరేగించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఉదయం 6 గంటలకు సుప్రభాతసేవ అనంతరం స్వామివారికి అభిషేకాలతో పాటు గోత్రనామాలతో పూజలు, నిత్యహోమాలు జరిగాయి. సాయంత్రం స్వస్తి వచనం, ప్రధాన హోమాలు, మహాలక్ష్మి హోమం, దిగ్దేవతా బలిహరణ, నీరాజన మంత్రపుష్పం, చూర్ణోత్సవం, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు.

నేటి కార్యక్రమాలు

శుక్రవారంతో ఉదయం సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మహాశాంతి హోమం, మహా పూర్ణాహుతి, చక్రస్నానం, ధ్వజావరోహణ, నీరాజన మంత్రపుష్పాలు, సాయంత్రం మహాదాశీర్వాచనం, ఏకాంత సేవ, నీరాజన మంత్రపుష్పాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

రోడ్డు కం రైల్వే బ్రిడ్జిపై రేపటి నుంచి రాకపోకలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గోదావరిపై రాజమహేంద్రవరం – కొవ్వూరు మధ్య ఉన్న రోడ్డు కం రైల్వే బ్రిడ్జిపై శనివారం నుంచి వాహనాల రాకపోకలను అనుమతించనున్నారు. కలెక్టర్ కె.మాధవీలత గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. రహదారి మరమ్మతుల కోసం ఈ బ్రిడ్జిని సెప్టెంబర్ 27 నుంచి మూసివేశామన్నారు. ప్రస్తుతం మరమ్మతులు పూర్తవడంతో ఆర్అండ్‌బీ అధికారుల సూచనల మేరకు ద్విచక్ర వాహనాలు, లైట్ మోటార్ వెహికల్స్, ఆటోలు, ఏపీఎస్ ఆర్టీసీ పల్లెవెలుగు బస్సులను మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు.

జైఎన్‌టీయూకే..

- క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో విద్యార్థుల సత్తా
- ఏడాదికి రూ.35 లక్షల ప్యాకేజీతో ఇద్దరు ఎంపిక
- రూ.16.30 లక్షలతో మరో ఇద్దరు
- అండగా నిలిచిన జగనన్న విద్యాదీవెన



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే విద్యార్థులు బహుళజాతి సంస్థల్లో కొలువులు దక్కించుకున్నారు. కళాశాల 75 ఏళ్ల చరిత్రలో అత్యధిక వేతనం పొందిన విద్యార్థులుగా వారు నిలిచారు. తాజాగా నిర్వహించిన ఇంటర్వ్యూల్లో నలుగురు మంచి ప్యాకేజీ సాధించారు. సీఎస్ఈ విద్యార్థి మన్యం శ్రీదేవి, ఈసీఈ విద్యార్థి బోడపాటి నివాస్ ఏడాదికి రూ.35 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించగా సీఎస్ఈ విద్యార్థి మార్ని యశ్వంత్, అల్లాడి సంధ్య ఏడాదికి రూ.16.30 లక్షలతో ఉద్యోగాలు సాధించారు. గత ఏడాది బీటెక్‌లో 441 మంది, ఎంటెక్‌లో 204 మంది చదివారు. 21 బహుళ జాతి కంపెనీల్లో 550 మంది విద్యార్థులు ఏడాదికి రూ.3.50 ప్రారంభ వేతనంతో ఉద్యోగాలు సాధించారు. ఈ ఏడాది అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు ఎల్అండ్‌టీ, అసెంచర్ కంపెనీల్లో 100 మంది వరకూ ఉద్యోగాలు సాధించారు.

ముందుగానే మెళకువలు

సాఫ్ట్‌వేర్ దిగ్గజ కంపెనీలు ఒరాకిల్, డార్విన్ బాక్స్, ఇంటెల్, యూనిటెడ్ ఆన్‌లైన్, ప్యాక్ట్‌సెట్, ఐబీఎం, టీసీఎస్, అసెంచర్, ఇన్ఫోసిస్‌తో పాటు కోర్ ఇంజినీరింగ్ కంపెనీలు జేఎస్‌డబ్ల్యూ, ఎల్అండ్‌టీ, డెక్కన్ కెమికల్ , మేధాసర్వో, వంటి వాటితో జేఎన్‌టీయూ కాకినాడకు అవగాహన ఒప్పందాలు ఉన్నాయి. సాఫ్ట్‌వేర్ కంపెనీలు అమలు చేస్తున్న అంశాలు, విధానాలపై క్యాంపస్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థుల్లో భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందిస్తున్నారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్‌పై ప్రత్యేక సెమినార్లు నిర్వహిస్తున్నారు. దీంతోనే క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విద్యార్థులు అద్భుతమైన రీతిలో సత్తా చాటారు. ఆయా విభాగాల అధ్యాపకులతో పాటు కళాశాలలో ఉన్న ప్లేస్‌మెంట్ కార్యాలయ సలహాలు, సూచనలతో విజయాలు సాధిస్తున్నారు.

మొదటి ఏడాది నుంచే శిక్షణ



ఇంజినీరింగ్ మొదటి ఏడాది నుంచే క్యాంపస్ సెలెక్షన్‌కు అవసరమయ్యే విధంగా శిక్షణ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. సాఫ్ట్‌వేర్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుని వారికి అవసరమయ్యే విధంగా శిక్షణ ఇస్తున్నాం. ఉద్యోగాల ఎంపికలో మార్పు వల్ల పోటీ పెరిగింది. ఏదో ఒక ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌పై పట్టు ఉండాల్సిందే. కాంపిటేటివ్ కోడింగ్‌పై ప్రతిరోజూ ప్రాక్టీస్ చేయాలి. ప్రతిభ మెరుగుపరచుకునేందుకు నిత్యం సాధన చేయాలి. క్యాంపస్‌లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణతో పాటు అవగాహన సదస్సులు, మెళకువలు సూచిస్తున్నాం. సాఫ్ట్‌వేర్‌తో పాటు కోర్ కంపెనీల్లో 550 ఆఫర్లు రావడం సంతోషంగా ఉంది. కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, టీపీఓ కరుణకు ప్రత్యేక అభినందనలు.

– డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, వీసీ

జగనన్న విద్యాదీవెన తోడ్పడింది



మాది సామర్లకోట. నా తండ్రి శ్రీనివాసరావు వ్యవసాయం చేస్తుండగా, తల్లి ధనలక్ష్మి గృహిణి. కామ్‌వాల్ట్ సంస్థ ఏడాదికి రూ.35 లక్షల ప్యాకేజీతో ఆఫర్ ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. జగనన్న విద్యాదీవెన నా చదువుకు ఎంతగానో దోహదపడింది.

– మన్యం శ్రీదేవి, సీఎస్ఈ

ఆనందంగా ఉంది



నాది ప్రకాశం జిల్లా ఒంగోలు. నా తండ్రి అమృతరావు వ్యాపారం చేస్తారు. తల్లి ఉషారాణి గృహిణి. రూ.35 లక్షల వేతనంతో ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది. కళాశాలలో నిర్వహించిన సెమినార్లు, శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకున్నాను. విద్యార్థులు కోడింగ్‌పై దృష్టి సారించాలి.

– బోడపాటి నివాస్, ఈసీఈ

ప్లేస్‌మెంట్ సెల్ సహకారంతో విజయం



మంచి సంస్థలో ఉద్యోగం సాధించాలంటే ట్రేడింగ్ టెక్నాలజీలో పట్టు సాధించాలి. వాటిలో అప్లికేషన్లు, యాప్, వెబ్‌సైట్‌లు క్రియేట్ చేయాలి. డార్విన్ బాక్స్ సంస్థలో ఏడాదికి 16.5 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం సాధించాను. ప్లేస్‌మెంట్ సెల్ అందించిన సహకారం విజయానికి దోహదపడింది.

– మార్ని యశ్వంత్, సీఎస్ఈ

రెండు సంస్థల్లో సాధించాను



అసెంచర్‌లో ఏడాదికి 4.5 వార్షిక వేతనంతో పాటు తాజాగా డార్విన్‌లో ఏడాదికి రూ.16.5 లక్షలతో ఉద్యోగం సాధించాను. నాకు ముఖ్యంగా జగనన్న విద్యాదీవెన పథకం చాలా ఉపయోగపడింది. వ్యవసాయ నేపథ్య కుటుంబానికి చెందిన చెందిన నాకు తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది.

– అల్లాడి సంధ్య, సీఎస్ఈ

రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీలు ప్రారంభం



రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం ప్రారంభమైన రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీలను ఆయన ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు హాజరయ్యారు. తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకున్న ఎమ్మెల్యే జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, తలిశెట్టి వెంకటేశ్వరరావు, ప్రవీణ్‌కుమార్, కొత్తపల్లి బుజ్జి, బాలిపల్లి రాంబాబు, మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష ఫీజు గడువు పెంపు

రాయవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లించేందుకు గడువు పెంచుతూ ప్రభుత్వ పరీక్షల విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే ఏడాది మార్చి/ఏప్రిల్‌లో జరిగే పది పరీక్షల గడువు ఈ నెల 10వ తేదీతో ముగియనుండగా, మరో పది రోజులు గడువును పెంపుదల చేస్తూ ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ జనరల్ డి.దేవానందరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 20వ తేదీలోగా చెల్లించే విధంగా గడువును పెంచారు. రూ.50 అపరాధ రుసుంతో ఈ నెల 21 నుంచి 25వరకు, రూ.200ల అపరాధ రుసుంతో ఈ నెల 26 నుంచి 30 వరకు, రూ.500ల అపరాధ రుసుంతో డిసెంబరు 1 నుంచి ఐదవ తేదీ వరకు చెల్లించేలా గడువును పెంచుతున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రత్నగిరిపై చురుగ్గా కార్తికమాస ఏర్పాట్లు

- ట్రయిల్ రన్ పద్ధతిలో వార్షిక కల్యాణ మంటపంలో వ్రతాల నిర్వహణ
- 450 వ్రతాలు ఏకకాలంలో నిర్వహించే అవకాశం
- మొదలైన విశ్రాంతి షెడ్డు నిర్మాణ పనులు



వార్షిక కల్యాణ మంటపంలో వ్రతాలు చేసుకుంటున్న భక్తులు

అన్నవరం: ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభమవుతున్న కార్తికమాసం సందర్భంగా రత్నగిరి సత్యదేవుని దర్శనానికి వేలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో అన్నవరం దేవస్థానంలో ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ప్రధానంగా ఈ కార్తికమాసం నెల రోజులూ సుమారు 1.60 లక్షల సత్యదేవుని వ్రతాలు జరిగే అవకాశం ఉండడంతో ప్రస్తుతం ఉన్న వ్రత మంటపాలతో బాటు అదనంగా వ్రత మంటపాలను తాత్కాలికంగా ఏర్పాటు చేసేందుకు దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రత్నగిరిపై రామాలయం వద్ద గల సత్యదేవుని వార్షిక కల్యాణ మంటపం ముందు గల విశ్రాంతి మంటపాన్ని కూడా సత్యదేవుని వ్రతాలాచరించేదుకు సిద్ధం చేశారు. ఈ విశ్రాంతి మంటపంలో గురువారం ఏకాదశి పర్వదినం సందర్భంగా ట్రయిల్ రన్ పద్ధతిలో వ్రతాలు నిర్వహించారు. సుమారు 450 వ్రతాలు ఈ మంటపంలో నిర్వహించవచ్చునని నిర్ణయించారు. కార్తికమాసంలోని పర్వదినాలలో ఇక్కడ వ్రతాలు నిర్వహించనున్నారు. వ్రత పురోహిత సంఘం నాయకుడు నాగాభట్ల రవిశర్మ, అల్లంరాజు శ్రీనివాస్ తదితరులు ఈ వ్రతాల ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పశ్చిమ రాజగోపురం వద్ద విశ్రాంతి షెడ్డు పనులు ప్రారంభం

పశ్చిమ రాజగోపురం వద్ద ఇటీవల తొలగించిన 30 వీఐపీ సత్రం స్థలంలో భక్తుల విశ్రాంతి షెడ్డు పనులు గురువారం ప్రారంభించారు. 175 అడుగుల పొడవు, 145 అడుగుల వెడల్పున ఇక్కడ భారీ షెడ్డు నిర్మిస్తున్నారు. ఈ షెడ్డులో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించనున్నారు. సుమారు రెండు వేల మంది ఇక్కడ విశ్రాంతి తీసుకునే అవకాశం ఉంది. ఈ షెడ్డుకు సమీపంలోనే పురుషులు, మహిళలకు విడివిడిగా మరుగుదొడ్లు, స్నానపుగదులు నిర్మిస్తున్నారు. ఈ షెడ్డులో భక్తులకు అందుబాటులో ఉండేలా తూర్పు రాజగోపురానికి ఎదురుగా వ్రతాలు, దర్శనం టిక్కెట్ల విక్రయ కౌంటర్, ప్రసాదం కౌంటర్, అరటి పండ్లు, కొబ్బరికాయల దుకాణం, ఇతర దుకాణాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్రీడలతో ఉల్లాసం



పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా కబడ్డీ ఆడుతున్న మంత్రి ఆర్కే రోజా

- మంత్రి ఆర్కే రోజా
- సౌత్ జోన్ అంతర్ వర్సిటీల కబడ్డీ పోటీలు ప్రారంభం

గండేపల్లి: క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహద పడతాయని ఆంధ్రప్రదేశ్ టూరిజం, కల్చర్ అండ్ యూత్ అడ్వాన్స్‌మెంట్ అండ్ స్పోర్ట్స్ మంత్రి ఆర్ కే రోజా అన్నారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూకే వైస్ చాన్సలర్ జి.వి.ఆర్ ప్రసాదరాజు అధ్యక్షతన జరిగిన సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ పురుషుల విభాగం టోర్నమెంట్‌కు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్థానిక క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ గెలుపు ఓటమి రెండు అక్షరాలే అయినా మూడు అక్షరాల గెలుపు ఇచ్చే కిక్ వేరే లెవెల్ అని అన్నారు. చిన్నతనం నుంచి తనకు కబడ్డీ అంటే ఎంతో ఇష్టం అన్నారు. అప్పుడు ఆటల్లో పోటీ పడితే ఇప్పుడు రాజకీయాల్లో పడుతున్నానని తెలిపారు. ఏ రంగంలో అయిన పోటీ సర్వసాధారణం అన్నారు. ఎదుర్కొని నిలవాలని విద్యార్థులకు స్ఫూర్తిని నింపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలకు పెద్దపీట వేశారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న డేర్ అండ్ డైనమిక్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యూత్ ఐకాన్‌గా నిలిచారన్నారు. డిసెంబర్ నుంచి గ్రామసచివాలయాల పరిధిలో క్రీడా పోటీలను నిర్వహిస్తామన్నారు. అనంతరం జ్యోతి వెలిగించి, బెలూన్‌లు ఎగరవేసి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. కబడ్డీ కోర్టులో క్రీడాకారులతో ట్రైల్ మ్యాచ్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. తొలుత ఆరు రాష్ట్రాలకు చెందిన 113 యూనివర్సిటీల నుంచి వచ్చిన 95 జట్లు నిర్వహించిన మార్చ్ పాస్ట్ గౌరవ వందనం స్వీకరించారు. ఆదిత్య విద్యా సంస్థల యాజమాన్యం తరపున ఎన్.శ్రుతిరెడ్డి, సుగుణారెడ్డి మంత్రి ఆర్కే రోజాను సన్మానించారు. ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, నన్నయ్య యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కె.పద్మరాజు, ఇండియన్ యూనివర్సిటీస్ జాయింట్ సెక్రటరీ బల్జీత్‌సింగ్‌సేఖోన్, ద్రోణాచారి అవార్డు గ్రహీత ఈ.ప్రసాద్‌రావు, ఆదిత్య విద్యా సంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి, వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

కిడ్నాప్ అయిన బాలుడు పోలీస్ స్టేషన్‌లో ప్రత్యక్షం



కిడ్నాప్ అయిన బాలుడు దుర్గానానిని తల్లిదండ్రులకు అప్పగించిన డీఎస్పీ లతాకుమారి

సామర్లకోట: స్థానిక నీలమ్మ చెరువు గట్టుపై ఉన్న ఎన్టీఆర్ ఎలిమెంటరీ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న తాడి దుర్గానాని గురువారం కిడ్నాప్ అయిన కొన్ని గంటల్లో పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యక్షం అయ్యాడు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి కథనం ప్రకారం బలుసులపేటకు చెందిన ఆ విద్యార్థి పాఠశాలకు వెళ్లగా సాయంత్రం సమయంలో కిడ్నాప్ చేశారు. ఆగంతకుడు విద్యార్థి తండ్రి రమేష్‌కు ఫోన్ చేసి రూ.నాలుగు లక్షలు డిమాండ్ చేశాడు. కూలీ పని చేసుకొనే రమేష్ రూ.నాలుగు లక్షల డిమాండ్‌తో ఆందోళనకు గురయ్యాడు. బాలుడు దుర్గానాని కిడ్నాప్‌పై తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసు బృందాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. బాలుడు క్నిడాప్ అయిన విషయం టీవీలలోను, సోషల్ మీడియాలోను రావడంతో ఆగంతకుడు బాలుడు దుర్గనానిని కాకినాడ జేఎన్‌టీయూ కళాశాల వద్ద రోడ్డుపై వదలి పరారయ్యాడు. ఆగంతకుడు ర్యాపిడో సంస్థకు చెందిన టూ వీలర్‌ను బుక్ చేసి బాలుడిని సామర్లకోట మఠం సెంటర్‌లో దింపాలని సూచించాడు. ర్యాపిడ్ సంస్థకు చెందిన వ్యక్తికి బాలుడు చిరునామా సక్రమంగా చెప్పక పోవడంతో అతనిని పోలీసు స్టేషన్‌కు తీసుకొని వచ్చి అప్పగించినట్టు డీఎస్పీ తెలిపారు. బాలుడిని అతని తల్లిదండ్రులకు అప్పగించారు. దాంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. బాలుడు క్షేమంగా చేరడానికి కారణమైన మీడియాను, ఎస్సై సతీష్ బృందాన్ని ర్యాపిడో సంస్థ సిబ్బందిని అభినందించారు. కాకినాడలో సీసీ కెమెరాలు ఆధారంగా ఆగంతుకుడిని గుర్తిస్తామని డీఎస్పీ తెలిపారు. బాలుడు కిడ్నాప్ సుఖాంతం అయి ఇంటికి చేరడంతో ఎంఈఓలు వై.శివరామ కృష్ణయ్య, పి.పుల్లయ్య, హెచ్ఎంలు టి.సాయిరామ కృష్ణ, ఎ.శైలజ బలుసులపేటలోని బాలుడు ఇంటికి చేరుకొని కిడ్నాప్ అయిన విధానాన్ని విద్యార్థి నుంచి అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

4 నుంచి 'నన్నయ'లో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో డిసెంబర్ 4 నుంచి 12 వరకు సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ (మెన్ అండ్ వుమెన్) చాంపియన్ షిప్ పోటీలు జరుగనున్నాయి. యూనివర్సిటీలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో స్పోర్ట్సు బోర్డు ఆధ్వర్యంలో గురువారం రివ్యూ సమావేశం జరిగింది. ఈ పోటీలకు సంబంధించిన వివిధ అంశాలపై వీసీ ఆచార్య కె.పద్మరాజు స్పోర్ట్సు బోర్డు ప్రతినిధులతో చర్చించారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్, గోవా రాష్ట్రాల నుంచి వంద యూనివర్సిటీలకు చెందిన 200 టీమ్స్ పోటీలలో పాల్గొంటాయన్నారు. అనంతరం యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగానికి ఏపీ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.భాస్కర రామ్ క్రికెట్ బ్యాట్‌లను బహూకరించారు.

మొసలి దొరికేసింది..!

- పట్టుకున్న అటవీశాఖ అధికారులు, మత్స్యకారులు
- ఊపిరి పీల్చుకున్న జనం



సమనసలో పట్టుబడిన మొసలి

అమలాపురం రూరల్: మండలంలోని చల్లపల్లి ప్రధాన పంట కాలువలో నెల రోజులుగా సంచరిస్తూ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న మొసలి ఎట్టకేలకు దొరికింది. రిస్క్ టీం, స్థానిక మత్స్యకారులు గురువారం రాత్రి మొసలిని బంధించారు. వలలో చిక్కిన మొసలిని కాలువ నుంచి బయటకు తీసుకువచ్చారు. పట్టుకున్న మొసలిని వ్యాన్‌లో ఎక్కించి ఊరేగింపుగా రాజమహేంద్రవరం తరలించారు. నడిపూడి లాకుల వద్ద గత నెల 7వ తేదీన కాలువలో మొసలి తిరుగుతున్నట్లు స్థానికులు గుర్తించారు. నడిపూడి లాకుల నుంచి నల్లవంతెన మధ్యగల ప్రధాన పంట కాలువలో మొసలి సంచరిస్తోందంటూ గత నెల 8వ తేదీన మున్సిపల్ కమిషనర్ నాయుడు ప్రకటించారు. ప్రజలు కాలంలోకి దిగకుండా అప్రమత్తంగా ఉండాలంటూ సూచించారు. అయితే కొద్ది రోజులకు ఆ మొసలి ఎర్ర వంతెన సమీపంలో సంచరిస్తున్నట్లు గుర్తించారు. దాంతో ఇరిగేషన్, అటవీశాఖ అధికారులు కాలువకు అడ్డంగా వలను కట్టి మొసలికి ఆహారంగా కుక్కను కట్టారు. అయినా సరే మొసలి చిక్కలేదు. రాత్రి సమయంలో అది గట్టు మీదకు రావడంతో పలువురు గుర్తించి ఫొటోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. కొన్నిరోజులకు సమనస లాకుల వద్ద ఆ మొసలి ప్రత్యక్షమైంది. రాత్రి సమయంలో రోడ్డెక్కి కనిపించింది. ఇరిగేషన్ అటవీశాఖ అధికారులు మొసలిని బంధించేందుకు బోన్ తెచ్చారు. అయినప్పటికీ పట్టుకోలేక పోయారు. ఉన్నతాధికారులు స్పందించారు. మొసలిని పట్టుకునేందుకు జిల్లా అటవీశాఖ అధికారి ప్రసాదరావు, విశాఖపట్నం నుంచి వచ్చిన డాక్టర్ ఫణీంద్ర, నలుగురు సభ్యుల రిస్క్ టీం బృందం గురువారం ఉదయం సమనస చేరుకుంది. లాకుల మెండి వద్ద మొసలిని గుర్తించారు. కాలువకు ఇటు, అటు వలలను కట్టి రిస్క్ టీం సభ్యులు, స్థానికులు, మత్స్యకారులు వలలతో వేటాడేందుకు దిగారు. మొసలి పట్టుకునేందుకు రకరకాల ప్రయత్నాలు చేశారు. అది వలలకు చిక్కినట్టే చిక్కి జారుకునేది. సాయంత్రం వరకు మొసలిని బంధించేందుకు ప్రయత్నాలు చేసినా ప్రయోజనం లేక పోయింది. దానిని పట్టుకునేందుకు కోళ్లను కూడా ఆహారంగా వేశారు. అయినా మొసలి చిక్కలేదు. రాత్రైనా సరే మొసలిని పట్టుకుని తీరాలని అధికారులు ప్రయత్నించారు. మొసలి ఉన్న ప్రదేశంలో కాలువకు అడ్డంగా కర్రలు కట్టి ఇసుక బస్తాలతో నీటికి అడ్డుకట్ట వేశారు. గ్రామ సర్పంచ్ పరమట శ్యామ్ కుమార్ అక్కడ లైటింగ్ ఏర్పాటు చేశారు. కాలువకు ఇటు, అటు వలలు వేయడంతో మొసలి చిక్కింది. దాంతో రోడ్డుపైకి చేర్చారు. మత్తు ఇంజెక్షన్ ఇచ్చి వ్యాన్‌లో రాజమహేంద్రవరం తరలించారు. దానిని అటవీ ప్రాంతంలో వదులుతామని జిల్లా అటవీశాఖ అధికారి ప్రసాదరావు తెలిపారు. మొసలి దొరికిందన్న ఆనందంతో స్థానికులు కేరింతలు కొడుతూ బాణసంచా కాల్చారు.